నమస్తే తెలంగాణ

ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ సోమవారం 6 జనవరి 2025 | ADILABAD NIRMAL


# అడవుల రక్షణ అందరి బాధ్యత

### బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్



ప్రత్యేక వాహనంలో గడ్డి మైదానాన్ని పరిశీలిస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, జనవరి 5 : అడవుల రక్షణ అందరి బాధ్యతగా భావించాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. ఆదివారం వడూర్ అటవీ ప్రాంతంలో వనదర్శిని కార్యక్రమాన్ని అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వడూర్ అటవీ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్‌తోపాటు వాచింగ్ టవర్‌ను ఏర్పాటు చేయాలన్నారు. రైతులకు అటవీ వన్యప్రాణులతో జరుగుతున్న పంట నష్టాన్ని ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అటవీశాఖ ఏర్పాటు చేసిన వాహనంలో అక్కడి గడ్డిమైదానాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, మండల కన్వీనర్ శివారెడ్డి, నాయకులు అంబేకర్ పండరి, పాండురంగ్, రాథోడ్ సురేందర్, శ్రీకాంత్, భూషన్, ఫయాజ్, ప్రతాప్‌సింగ్, చంద్రశేఖర్ యాదవ్, ప్రదీప్, అటవీ రేంజ్ అధికారి గణేశ్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

# ఓదార్పునిచ్చేందుకు..

## నేడు కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎమ్మెల్సీ కవిత పర్యటన

- జైనూర్‌లో నీలాబాయి, దాబాలో శైలజ కుటుంబాలకు పరామర్శ
- స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేసిన బీఆర్‌ఎస్ శ్రేణులు
- మొదటగా ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళి
- 120 కిలోమీటర్ల మేర భారీ బైక్ ర్యాలీ
- సింగరేణి కార్మికులతో సమావేశం

కుమ్రం భీం ఆసిఫాబాద్, జనవరి 5(నమస్తే తెలంగాణ) : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో సోమవారం ఎమ్మెల్సీ కవిత పర్యటించనున్నారు. ఇందుకోసం బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఏర్పా ట్లు చేశాయి. రహదారులన్నీ పోస్టర్లు, ఫ్లెక్సీలతో నిండి గులాబీ మయంగా మారాయి. మొదటగా ఆదిలాబాద్ జిల్లాలోని ఇంద్రవెల్లి అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తారు. అనంతరం జైనూర్ మండలంలోని నార్నూర్ ఎక్స్ రోడ్డు నుంచి రెబ్బెన మండలంలోని గోలేటి వరకు దాదాపు 120 కిలోమీటర్ల మేర బైక్‌ర్యాలీ కొనసాగనుంది. జైనూర్ మండలంలోని దేవునిగూడలో ఆటోడ్రైవర్ చేతిలో హత్యాయత్నానికి గురైన మెస్రం నీలాబాయిని పరామర్శిస్తారు. అనంతరం జైనూర్ మండల కేంద్రంలోని ఆసుపత్రి, బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తారు. వాంకిడి మండలంలోని దాబా గ్రామానికి చెందిన విద్యార్థి శైలజ విష ఆహారం బారిన పడి మరణించిన విషయం తెలిసిందే. వీరి కుటుంబ సభ్యులను పరామర్శిస్తారు. రాష్ట్రంలోనే సంచలనం కలిగించిన రెండు ఘటనల్లో బాధిత కుటుంబాలకు ఆరు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నుంచి పైసా రాలేదు. అనంతరం గోలేటిలో సింగరేణి కార్మికులతో సమావేశం నిర్వహించి, కార్మికుల నుంచి సమస్యలను తెలుసుకుంటారు.



వాంకిడి ఆశ్రమ పాఠశాలలో విష ఆహారంతో మరణించిన విద్యార్థిని కుటుంబ సభ్యులు

### చావు అంచుల దాకా వెళ్లిన నీలాబాయి

ఆటోడ్రైవర్ చేతిలో హత్యాయత్నానికి గురైన నీలాబాయి చావు అంచుల దాకా వెళ్లింది. ఈ ఘటనతో ఆవేశానికి గురైన ఆదివాసులు జైనూర్ మండలంలోని ఓ వర్గానికి చెందిన వ్యాపార సముదాయాలకు నిప్పుపెట్టి ధ్వంసం చేశారు. దాదాపు మూడు నెలలపాటు పోలీసులు కట్టుదిట్టమైన ఆంక్షలు విధించారు. ఇరువర్గాల వారిని కట్టడిచేసి శాంతిని నెలకొల్పేందుకు కఠిన చర్యలను అమలు చేశారు. ఈ ఘటన జరిగి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ జైనూర్‌పై పోలీసుల నిఘా కొనసాగుతూనే ఉంది.

### ఆర్థిక సహాయం అందలేదు : నీలాబాయి

నాపై దాడి జరిగి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందలేదు. నా కొడుకు ప్రవీణ్‌కుమార్‌కు నామమాత్రంగా కెరమెరిలోని హట్టిలో గల ఆశ్రమ పాఠశాలలో ఔట్‌సోర్సింగ్ పని కల్పించారు. రోజు వారి కూలీగా పనిచేసుకుంటూ జీవించే నాపై హత్యాయత్నం జరిగిన తరువాత కోలుకునేందుకు మూడు నెలలు పట్టింది. నాపై హత్యాయత్నం చేసినప్పుడు తగిలిన గాయాలు ఇప్పటికీ బాధిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలి. పక్కా ఇల్లు ఇవ్వాలని కోరుతున్నా.

### 25 రోజులు వెంటిలేటర్‌పై ఉండి..

వాంకిడి బాలికల ఆశ్రమ పాఠశాలలో విష ఆహారం తిని దాదాపు 60 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఇందులో తొమ్మిదో తరగతి విద్యార్థిని శైలజ ప్రాణాపాయ స్థితిలో దాదాపు 25 రోజులపాటు హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ మృతి చెందింది. కట్టుదిట్టమైన భద్రత మధ్య శైలజ అంత్యక్రియలు నిర్వహించారు. శైలజ మరణంతో విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టాయి. దీంతో ప్రభుత్వం వారి కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చింది. కానీ, ఇప్పటివరకు సహాయం అందలేదని కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు.

### ఆదుకోవాలి..



మా బిడ్డ చనిపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న మాకు ప్రభుత్వం నుంచి సహాయం అందలేదు. మా బిడ్డ అంత్యక్రియలను కూడా పోలీసులు బలవంతంగా నిర్వహించారు. ఆ సమయంలో మాకు రూ.50 లక్షలు, మా కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, పక్కా ఇల్లు, ఐదెకరాల భూమి కావాలని అడిగాం. వీటిలో ఏ ఒక్కటి కూడా ప్రభుత్వం నెరవేర్చలేదు. ఐటీడీఏ డీడీ రూ.2 లక్షలు, ఎమ్మెల్సీ దండె విఠల్ రూ.లక్ష ఇచ్చారు. అంత్యక్రియల కోసం రూ. లక్ష ఇచ్చారు. బొంబారలోని ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని తండ్రి తుకారాంకు ఔట్‌సోర్సింగ్‌లో పని కల్పించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

- శైలజ తల్లి మీరాబాయి



పాడె మోస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, నాయకులు

# పాడె మోసిన రామన్న

ఎదులాపురం, జనవరి 5 : సీనియర్ నాయకుడు రోకండ్ల రమేశ్ అంత్యక్రియలు అశ్రునాయనాల మధ్య ఆదివారం జరిగాయి. ఆదిలాబాద్ పట్టణంలోని జీఎస్ ఎస్టేట్ నుంచి అంతిమయాత్ర ప్రారంభమైంది. స్థానిక తిర్పెల్లిలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు పూర్తయ్యాయి. దీనికి మాజీ మంత్రి రామన్నతోపాటు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, బీఆర్‌ఎస్ నాయకుడు గంద్రత్ రమేశ్, ప్రహ్లాద్, పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అకాల మరణంపై సానుభూతి వ్యక్తం చేశారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

# కడెం నీటి విడుదల

కడెం, జనవరి 5 : యాసంగి పంటల కోసం కడెం ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా నీటిని ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అధికారులు, నాయకులతో కలిసి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 694.650 అడుగులు (6.279టీఎంసీల) నీటి ఉన్నదని కడెం ప్రాజెక్టు ఈఈ విఠల్, డీఈ నవీన్ తెలిపారు. ఆయకట్టు కింద సాగవుతున్న నిర్మల్, మంచిర్యాల జిల్లాల్లోని 17 వేల ఎకరాలకు వారబంధి పద్ధతిన ఏప్రిల్ 17 వరకు నీటిని అందించనున్నట్లు తెలిపారు.




నిర్మల్ ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

# నిర్మల్ చరిత్ర ప్రపంచానికి తెలిసేలా ఉత్సవాలు

### కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 5 : నిర్మల్ చరిత్ర, సాంస్కృతిక వారసత్వ సంపదను ప్రపంచానికి తెలిసే విధంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం ఉత్సవాలను కలెక్టర్ ప్రారంభించారు. మూడు రోజుల పాటు నిర్వహించే ఉత్సవాలను ప్రజలు విజయవంతం చేయాలని, సందర్శకులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను కలెక్టర్, అదనపు కలెక్టర్లు పరిశీలించారు. పాఠశాలల విద్యార్థులు, వ్యవసాయ గ్రామీణ అభివృద్ధి, మహిళా స్వయం సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి పాల్గొన్నారు.

# కేశవపట్నంలో ఉద్రిక్తత

- గ్రామస్తులు, అటవీ శాఖ అధికారుల మధ్య ఘర్షణ
- ధ్వంసమైన ఫారెస్టు అధికారుల వాహన అద్దాలు

ఇచ్చోడ, జనవరి 5 : కేశవపట్నం గ్రామంలో ఆదివారం అటవీశాఖ అధికారులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పలు ఇండ్లలో దొరికిన కలపను స్వాధీనం చేసుకున్నారు. గ్రామస్తులు, అటవీ శాఖ అధికారుల మధ్య తోపులాట జరగడంతో ఉద్రిక్తత వాతావరణం నెలకున్నది. అటవీ శాఖ వాహన అద్దం పగిలింది. ఇచ్చోడ, నేరడిగొండ ఎస్సైలు తిరుపతి, శ్రీకాంత్‌లు గ్రామస్తులను సముదాయించారు.

**చర్యలు తీసుకుంటాం..**

చెట్లను నరికి అక్రమ కలప రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అటవీ శాఖ జిల్లా అధికారి ప్రశాంత్ బాజీరావ్ అన్నారు. ఆదివారం కేశవట్నంలో పట్టుకున్న కలప గురించి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉట్నూర్ ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర ఆధ్వర్యంలో దాడి చేసి నిల్వ ఉన్న కలపను పట్టుకున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న కలప విలువ దాదాపు రూ.3.50 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలోకి అటవీ శాఖ అధికారులు వెళ్లడంతో గ్రామస్తులు భయపడ్డారని, దీంతో ఘర్షణ వాతావరణం నెలకుందన్నారు. అధికారులకు ఎటువంటి గాయాలు కాలేదన్నారు. 20 మంది స్మగ్లర్లను గుర్తించడం జరిగిందన్నారు. ముఖ్యంగా జగడ హుస్సేన్, షేక్ షరీఫ్, షేక్ రంజాన్, షేక్ జువిద్, షేక్ సద్దాం, షేక్ కరీం, జహుర్‌ను గుర్తించామన్నారు. ఈ సమావేశంలో ఎఫ్‌డీవో రేవంత్ చంద్ర, ఎఫ్‌ఆర్‌వో పుండలిక్, నాగస్వామి, సెక్షన్ ఆఫీసర్లు గిరయ్య, రాకేశ్, బీట్ ఆఫీసర్లు సంతోష్ పాల్గొన్నారు.



కేశవపట్నంలో కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న అటవీ శాఖ సిబ్బంది




పగిలిన అటవీ శాఖ వాహన అద్దం


# కవ్వాల్‌లో బర్డ్‌వాక్

- అరుదైన పక్షుల గుర్తింపు
- వివిధ జిల్లాల నుంచి వచ్చిన పర్యాటకులు



చేపను తింటున్న కింగ్ ఫిషర్

*జన్నారం, జనవరి 5 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్ జన్నారం డివిజన్ తాళ్లపేట రేంజ్‌లోని మాకులపేట, ఇందన్‌పెల్లి రేంజ్‌లోని ఘనిశట్టి కుంట ప్రాంతాల్లో ఆదివారం 'బర్డ్‌వాక్ ఫెస్టివల్' నిర్వహించారు. జన్నారం, ఇందన్‌పెల్లి ఫారెస్ట్ రేంజ్ అధికారులు సుష్మారావు, కారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన 15 మంది పర్యాటకులు, వారి కుటుంబ సభ్యులను సఫారీలో అడవిలోకి తీసుకెళ్లి వివిధ ప్రాంతాలను చూయించారు. కింగ్ ఫిషర్, కామన్‌ఫిష్, తండర్ కింగ్‌ఫిషర్, సర్పంట్‌ఈగల్‌తో పాటుగా మరో 16 రకాల పక్షులను పర్యాటకులు గుర్తించి కెమెరాల్లో చిత్రీకరించారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా వసతులు కల్పించినట్లు జన్నారం రేంజ్ ఆఫీసర్ సుష్మారావు తెలిపారు.*



యెల్లో ఐడ్ బబ్లార్



రూఫాస్‌ట్రీపీ



కామన్ ఈగల్



కవ్వాల్ అడవుల్లో పక్షులను కెమెరాల్లో బంధిస్తున్న పక్షి ప్రేమికులు



నిరసన వ్యక్తం చేస్తున్న హమాలీలు

# కొనసాగుతున్న హమాలీల సమ్మె

నిర్మల్ చైన్‌గేట్, జనవరి 5 : హమాలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ అనుబంధ సివిల్ సప్లయ్, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె ఐదో రోజుకు చేరుకున్నది. ఆదివారం సమ్మె శిబిరాన్ని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి విలాస్ తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విలాస్ మాట్లాడుతూ.. పెంచిన హమాలీ రేట్లు, ఒప్పుకున్న డిమాండ్లకు ప్రభుత్వం జీవోను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జీవో సాధనకు నిర్వహిస్తున్న ఆందోళనల్లో భాగంగా కలెక్టర్‌కు వినతిపత్రం, ధర్నాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ పుండలిక్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాయన్న, బలరాం, రాథోడ్ రమేశ్, బాబూలాల్, కార్మికులు పాల్గొన్నారు.

# యువకుడిపై హత్యాయత్నం

### 24 గంటలలోపు పట్టుకున్న పోలీసులు



నిందితుడు సాయికుమార్‌తో పోలీసులు

సారంగాపూర్, జనవరి 5 : బోరిగాం గ్రామానికి చెందిన యువకుడు బొబ్బిలి సాయికుమార్‌ను హత్యాయత్నం కేసులో ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. నిర్మల్ రూరల్ సీఐ వివరాల ప్రకారం.. బోరిగాం గ్రామానికి చెందిన షేక్ అర్షద్‌కు అదే గ్రామానికి చెందిన సాయికుమార్‌తోపాటు మరో మైనర్ వ్యక్తితో డిసెంబర్ 31వ తేదీ రాత్రి చిన్న గొడవ జరిగింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని సాయికుమార్, మరో మైనర్ స్నేహితుడితో కలిసి ప్రణాళిక ప్రకారం షేక్ అర్షద్‌పై దాడి చేయాలని నిర్ణయించుకున్నారు. శనివారం రాత్రి సుమారు 8 గంటలకు అర్షద్‌ను బోరిగాంలోని అంబేద్కర్ విగ్రహం వద్దకు పిలింపించి గొడవకు దిగారు. అర్షద్‌ను ఎలాగైన చంపాలనే ఉద్దేశంతో సాయికుమార్ కత్తితో అర్షద్‌ను నడుము భాగంలో పొడిచి పారిపోయారు. ఇద్దరిపై ఏఎస్పీ రాజేశ్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ శ్రీకాంత్‌లు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం నిందితులను పట్టుకుని ఏ-1గా సాయికుమార్, ఏ-2గా మైనర్ వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా.. నిందితుల నుంచి కత్తి, సెల్‌ఫోన్, మోటార్‌సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. తీవ్రగాయాలైన అర్షద్ నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

# కొనసాగుతున్న పులి రక్షణ చర్యలు

తాంసి(భీంపూర్), జనవరి 5 : భీంపూర్ మండలంలో పిప్పల్‌కోటి, గొల్లఘూడ్, తాంసి(కే) అటవీ ప్రాంతాల్లో శనివారం మూడు ఆవులు పులి దాడిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎఫ్ఎస్‌వోలు అహ్మద్ ఖాన్, భూపతిరావ్, సిబ్బంది సాయి అడవిలో అణువణువు గాలిస్తున్నారు. నైట్ విజన్ కెమెరాలు అమర్చారు. అయితే ఆనవాళ్లు కనిపించలేదని తెలిపారు.



పిప్పల్‌కోటి అడవిలో గాలింపు చేపట్టిన సిబ్బంది